# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. కృత్రిమ మేథ రంగంలో "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్" ఒక కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

2. ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

3. తెలంగాణలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులకు మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తెస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.

4. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.

===========================

కృత్రిమ మేథ –ఎఐ రంగంలో "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్" ఒక కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా తన మనసులోని భావాలను పంచుకునే "మన్ కీ బాత్" 131 సంచిక కార్యక్రమంలో పలు అంశాలపై ప్రధానమంత్రి నిన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా జరిగిన "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్" గురించి ప్రస్తావించారు. ఎఐ సహాయంతో భారతదేశం పురాతన గ్రంథాలు, చేతిరాత ప్రతులను ఎలా సంరక్షిస్తుందో చూసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులు ఆశ్చర్యపోయారని గుర్తు చేసుకున్నారు. ఈ సమ్మిట్‌లో కృత్రిమ మేథ రంగంలో భారతదేశపు అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచం చూడగలిగిందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలకు ఫైబర్ ఇంటర్నెట్ లక్ష్యంగా భారత్ నెట్ ప్రాజెక్టు అమలుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో అధికారులు ఒప్పందంపై నిన్న సంతకాలు చేశారు. ఈ సందర్భంగా

చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులు గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంతరిక్ష, రక్షణ తయారీ రంగాల్లో ఆ సంస్థ కార్యకలాపాలపై వారు ముఖ్యమంత్రికి ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాల్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి వివరించారు.

-----------------------------

తెలంగాణలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తెస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో రేవంత్‌రెడ్డి నిన్న పర్యటించి తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

-----------------------------

గ్రామీణ తపాలా సేవలు దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవకుల సమ్మేళనంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలా సేవలను గ్రామస్థాయిలోకి తీసుకువెళ్ళిన పదిమంది గ్రామీణ డాక్ సేవకులను సన్మానించారు. అనంతరం కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో గ్రామీణ డాక్ సేవకులు తపాలా సేవలను అందిస్తున్నారని తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈరోజు ప్రథమ సంవత్సరం, రేపు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు మొదలవుతాయి. ప్రథమ, ద్వితీయ వార్షిక పరీక్షలకు పది లక్షల 57 వేల 312 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా చెప్పారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తూ,

వాయిస్..30 సెకన్లు

ఈ రోజు మొదటి సంవత్సరానికి గాను ద్వితీయ భాష పరీక్ష జరగనుంది.

-----------------------------

తిరుమలలో అత్యాధునిక ఆహార ప్రయోగశాల సేవలు త్వరలో అందుబాటులోనికి తీసుకురాబోతున్నామని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. భక్తులకు సురక్షితమైన, నాణ్యత కలిగిన ప్రసాదాలు, ఆహారం అందించేందుకు వీలుగా 25 కోట్ల రూపాయలతో ఈ ల్యాబ్ ను అత్యాధునిక పరికరాలు యంత్రాలతో సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయని ఈ ల్యాబ్ కార్యకలాపాలు వచ్చేనెల నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ ల్యాబ్‌లో మైక్రో బయాలజీ, రసాయన విభాగాల్లో నమూనాల పరీక్షలు జరగనున్నాయని దీని ద్వారా ప్రసాదాలు, ఆహార పదార్థాలు, నీరు, ముడిసరకుల నాణ్యతను పరీక్షిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వివిధ పంటల సాగు, విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ ప్రదర్శనలు నిర్వహిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన “రైతుబడి వ్యవసాయ ప్రదర్శన”ను ఆయన నిన్న సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, విస్తృతంగా క్షేత్రస్థాయి సందర్శనలునిర్వహిస్తామని, త్వరలోనే సిద్దిపేట జిల్లాలో పెద్ద ఎత్తున ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు.. డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే రైతులు లబ్ధి పొందుతారని, ఆయిల్ పామ్ సాగు అన్నివిధాలా లాభదాయకమని, అంతర పంటగాను దీన్ని సాగు చేయవచ్చని మంత్రి సూచించారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ శాంతి, అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అమెరికాలోని చికాగో నగరంలో 1905 ఫిబ్రవరి 23వ తేదీన రోటరీ క్లబ్ మొదటి సమావేశం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. హింస, దౌర్జన్యాలులేని ప్రపంచాన్ని కాంక్షిస్తూ శాంతి స్థాపన దిశగా ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

టీ-20 ప్రపంచ కప్-2026 సూపర్-8 గ్రూప్-1 విభాగంలో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో గెలుపొందింది. గుజరాత్ రాష్ట్రం అహమ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటవ్వడంతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పలు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణాలోనూ ఈరోజు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================